


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 19.01.2026 | సంపుటి : 2 | సంచిక :343 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 19.01.2026 | volume : 2 | Issue : 343 | Pages : 8 | Cost : 2/- |


# 'మహా జంగిల్ రాజ్'కు ముగింపు పలుకుతాం

**బీజేపీ డబుల్ ఇంజన్ మోడల్‌ను ఆదరించండి**

**బెంగాల్ ప్రజలకు మోదీ పిలుపు**



**ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదార్లను కాపాడుతూ దేశ భద్రతతో ఆటలాడుతున్న తృణమూల్ కాంగ్రెస్ పారచెవతీతీచటకి బుద్ధి చెప్పాలని పశ్చిమబెంగాల్ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. "రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొల్పాలంటే 'మహా జంగిల్‌రాజ్'ను అంతం చేయాల్సిందే. అభివృద్ధి కావాలన్నా, పెట్టుబడిదారులను ఆకర్షించాలన్నా తృణమూల్‌ను చిత్తుగా ఓడించాల్సిందే" అన్నారు.**

సింగూర్ : మోదీ ఆదివారం హుగ్లీ జిల్లాలోని సింగూర్‌లో పర్యటించారు. రూ.830 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మూడు వందేభారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. రాబోయే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మహా జంగిల్‌రాజ్‌కు, బీజేపీ సుపరిపాలనకు పోరు జరగనుందన్నారు. తప్పుడు డాక్యుమెంట్లతో స్థిరపడిన చొరబాటుదార్లను తాము అధికారంలోకి రాగానే వెనక్కి పంపిస్తామని పునరుద్ఘాటించారు. బీజేపీ డబుల్ ఇంజన్ మోడల్‌ను ఆదరించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కపస్తామన్నారు.

-మిగతా 3 లో..



# మున్సిపల్ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

## ఫిబ్రవరిలో మున్సిపోల్స్

- మేడారంలో కేబినెట్ కీలక నిర్ణయాలు
- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికల నిర్వహణ
- ఘనంగా గోదావరి పుష్కరాలు
- బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్
- మెట్రో విస్తరణ కోసం భూసేకరణకు రూ.2,787 కోట్లు
- హైదరాబాద్‌లో 9 కి.మీ. కొత్త బ్రిడ్జి నిర్మాణం
- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు
- మేడారంలో జరిగిన సమావేశ వివరాలను వెల్లడించిన పొంగులేటి, కోమటిరెడ్డి, సీతక్క

**రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లతో వాటిలోని 2,999 వార్డులు/డివిజన్లకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రకారం ఇప్పటికే మేయర్/చైర్మన్, కార్పొరేటర్/కౌన్సిలర్ పదవులకు సంబంధించి రిజర్వేషన్లను ప్రకటించింది. ఫిబ్రవరిలోనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయం తీసుకుంది.**

హైదరాబాద్: ఫిబ్రవరి 15న శివరాత్రి, 16 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుండగా, ఆలోగా విద్యార్థులకు పరీక్షలు సైతం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియకు ఇబ్బందులు రాకుండా షెడ్యూల్ రూపొందించాలని సూచించింది. ములుగు జిల్లా మేడారం మహాజాతర సందర్భంగా సమ్మక్క–సారలమ్మ సన్నిధిలో ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం

-మిగతా 2 లో..

## మేడారం జాతరను దక్షిణాది కుంభమేళాగా నిర్వహిస్తాం

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



వరంగల్: మేడారాన్ని అభివృద్ధి చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఈ మహాజాతరను దక్షిణాది కుంభమేళా స్థాయిలో ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో మేడారంలో ఆదివాసీ


-మిగతా 2 లో..



03

## రూ.7 చోరీ కేసు.. 50 ఏళ్లకు తీర్పు

**మహారాష్ట్రలో 50 ఏళ్ల నాటి ఓ చోరీ కేసుకు ఎట్టకేలకు తెరపడిం ది. ఇద్దరు నిందితులతో పాటు ఫిర్యాదుదారుడి గురించి పోలీసులు అనేక ఏళ్లుగా వెతుకుతున్నప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. దీంతో ఈ కేసుకు ముగింపు పలుకుతున్నట్లు స్థానిక న్యాయస్థానం పేర్కొంది.**



03

## మౌని అమావాస్య పుణ్యస్నానాలు

**త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తులు**



## ప్రారంభమైన నాగోబా జాతర

ఆదిలాబాద్ : అతిపెద్ద గిరిజన జాతర 'నాగోబా' ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి మహాపూజతో అట్టహాసంగా ప్రారంభమైంది. ఆదివాసీ సంప్రదాయ రీతిలో

-మిగతా 2 లో..

# కట్టు కథలకు భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదు

**నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్ రద్దు**

**నిబంధనలపై ఆరోపణలు రావడంతో నిర్ణయం**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి**

**తెలంగాణ ప్రభుత్వ ఆస్తులు, ఆత్మను కాపాడటమే తన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆస్తుల సంపాదన కోసమో.. వ్యాపారాన్ని విస్తరించుకునేందుకో రాజకీయాల్లోకి రాలేదని చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో ఓ పత్రికలో అడ్డగోలు రాతలు రాశారన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.**

హైదరాబాద్: "రాష్ట్ర ఆస్తులు, వనరులను సంరక్షించి పేదలకు సమానంగా పంచడమే నా లక్ష్యం. సింగరేణి సంస్థ.. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లను పిలిచింది. దీనిపై కట్టుకథ, పిట్టకథలు అల్లి ప్రజలను మభ్యపెట్టేలా కథనం

-మిగతా 2 లో..






# మోడీ సర్కార్‌ను గద్దె దించితేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది

**సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

**భాజపా అంటే బ్రిటిష్ జనతా పార్టీ అని మండిపాటు**

**కాంగ్రెస్ పోరాటానికి కలిసి రావాలని కమ్యూనిస్టులకు పిలుపు**

ఖమ్మం: ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలని కోరుకునే ప్రతి ఒక్కరూ దండు కట్టి మోదీ ప్రభుత్వంపై పోరాటం ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వారిపై కాంగ్రెస్ చేస్తున్న పోరులో కలిసి రావాలని కమ్యూనిస్టులకు సూచించారు. కాంగ్రెస్ అయినా, కమ్యూనిస్ట్ అయినా, ఇంకెవరైనా సరే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరమొచ్చిందన్నారు. అంతా కలిసి మోదీని గద్దె దింపుదామని.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో ఆదివారం జరిగిన బహిరంగసభకు

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 156 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 183 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 265 (కిలో) |
| స్కిన్ లెస్ | 302 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

# కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా

**- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

సంగారెడ్డి: కాంగ్రెస్‌లో ఉండటం వల్ల ఎలాంటి లాభం లేదంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పటాన్ చెరు జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో తన అనుచరులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పటి పరిస్థితుల దృష్ట్యా తప్పటడుగు వేసి కాంగ్రెస్ పార్టీలో చేరానంటూ వ్యాఖ్యానించారు. మూడు సార్లు

-మిగతా 2 లో..



# నేరాలను ప్రోత్సహించేలా సీఎం మాట్లాడటం సిగ్గుచేటు

**బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**శాంతిభద్రతలను కాపాడాల్సిన రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ అసాంఘిక చర్యలను, నేరాలను ప్రోత్సహించేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. భారాస జెండా గద్దెలను ధ్వంసం చేయాలని హోంశాఖను కూడా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.**



హైదరాబాద్: ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "భారాస పదేళ్ల పాలనలో శాంతిభద్రతల విషయంలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా

-మిగతా 2 లో..

# రిజర్వేషన్లు తేల్చకుండా ఎన్నికలకు వెళ్లడం రాజ్యాంగ విరుద్ధం

**20 నుంచి నిరసనలు : ఆర్.కృష్ణయ్య**

హైదరాబాద్ : 'ఒకవైపు హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసు నడుస్తుండగానే ప్రభుత్వం హడావుడిగా మున్సిపల్ ఎన్నికలకు ఎందుకు సిద్ధమవుతోంది' అని బీసీ ఐకాస ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. రిజర్వేషన్లు తేల్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ, న్యాయ

-మిగతా 2 లో..



# మున్సిపల్ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

మేడారంలో సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత హైదరాబాద్ వెలుపల మంత్రివర్గ సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. కేబినెట్ భేటీ వివరాలను సమాచార, ప్రజాసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహచర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కతో కలిసి అక్కడే మీడియాకు వెల్లడించారు.

### టెంపుల్ సర్క్యూట్...

2027 జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు జరగనుండటంతో ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. బాసర నుంచి భద్రాచలం వరకు రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాలను 'టెంపుల్ సర్క్యూట్'పేరుతో ఎకో--టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని తీర్మానించింది. ప్రణాళిక తయారీకి త్వరలో మంత్రివర్గ ఉపసంఘం వేయాలని నిర్ణయించింది. దేవాదాయ, రెవెన్యూ, అటవీ, పర్యాటక, పురాతత్వ శాఖలు సంయుక్తంగా ఫిబ్రవరి తొలివారం నాటికి సమగ్ర నివేదికను అందిస్తాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మార్చి 31 నాటికి మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని తీర్మానించామని, నివేదిక తయారీకి కన్సల్టెన్సీని సైతం ఖరారు చేసినట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సంస్థలకు 14 ప్రాంతాల్లో మార్కెట్ ధర ఆధారంగా భూములు కేటాయించాలని నిర్ణయించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎస్‌బీఐ కార్పొరేట్ కార్యాలయం నిర్మాణానికి వరుసగా 20, 17 కుంటల భూమిని మార్కెట్ ధరకు కేటాయించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునేందుకు సంబంధించి ఇంతవరకు జరిగిన పురోగతిని కేబినెట్ సమీక్షించింది. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని, తదుపరి చర్చ కోసం వచ్చే మంత్రివర్గ సమావేశం ముందు ఫైల్‌ను పెట్టాలని ఆదేశించింది. 'మెట్రో ఫేజ్-2ఏ'నాలుగు కారిడార్లు, 'ఫేజ్-2బీ'కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ఈలోపు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుని రూ.2,787 కోట్ల అంచనాలతో భూ సేకరణ ప్రతిపాదనలను ఆమోదించింది. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో హామ్ విధానంలో రూ.11,334 కోట్లతో 6 వేల కి.మీ. రహదారుల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను వేగిరం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.6వేల కోట్లతో గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరుసల రోడ్ల నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభించాలని నిర్ణయించినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండేళ్ల తర్వాత రాష్ట్రంలో మట్టి రోడ్డు కనిపించదన్నారు. ములుగు జిల్లాలో కొత్తగా రూ.143 కోట్లతో పొట్లాపూర్ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రామప్ప చెరువు నుంచి నీటిని లిఫ్ట్ చేసి ములుగు జిల్లాలోని 5 గ్రామాలు, 30 చెర్వులు కుంటలను నింపడంతోపాటు 7,500 ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించనుంది. రూ.143 కోట్ల అంచనా వ్యయంతో ఈ పథకం చేపట్టనుంది. భవిష్యత్తులో 15-20వేల ఎకరాలకు ఆయకట్టును పెంచే అవకాశం ఉందని మంత్రి సీతక్క వెల్లడించారు. తిరుపతి, కుంభమేళాను మరిపించేవిధంగా మేడారం ఆలయాన్ని అద్భుత పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్టు మంత్రి పొంగులేటి తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల సమక్షంలో పునరుద్ధరించిన ఆలయాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆలయాభివృద్ధికి 19 ఎకరాలను సేకరించగా, మరో 21--22 ఎకరాలు సేకరించనున్నామన్నారు. 41-42 ఎకరాలను ఆలయం పేరుతో సేకరించి ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. జంపన్నవాగులో 365 రోజులు నీళ్లు ఉండేలా రామప్ప పైప్‌లైన్ ద్వారా గోదావరి జలాలను లక్నవరంకు తరలించి అక్కడి నుంచి జంపన్న వాగుకు తీసుకురావాలని సీఎం రేవంత్ ప్రకటించారని గుర్తుచేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తిశ్రద్ధలతోనే గద్దెలు, ప్రాకారాలు తయారు చేయించామని, రాజకీయంతో కాదని విలేకరుల ప్రశ్నకు పొంగులేటి బదులిచ్చారు. మీడియా సమావేశంలో ఎంపీ బలరామ్ నాయక్ పాల్గొన్నారు.





## మేడారం జాతరను దక్షిణాది కుంభమేళాగా నిర్వహిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సాంస్కృతిక నృత్యాలను ఆయన వీక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... "కాకతీయుల కత్తికి ఎదురు నిలిచిన సమ్మక్క-సారలమ్మల ధీరత్వమే దైవత్వంగా మారిన చారిత్రక సత్యం వనజాతరగా ఆవిష్కృతమైంది. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా వెలుగొందుతోంది. గుడిలేని తల్లులను తెలంగాణ గుండె నిండా కొలుస్తోంది. ప్రజాకంటక పాలనను గద్దె దించాలని 2023 ఫిబ్రవరి 6న ఇక్కడి నుంచే పాదయాత్ర ప్రారంభించాం. తల్లుల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మేడారం అభివృద్ధిలో భాగంగా... వంద రోజుల్లో రాతి కట్టడాలతో తల్లుల ప్రాంగణాన్ని అభివృద్ధి చేశాం. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే గిరిజనుల కోసం సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేశామని గర్వంగా చెప్పుకొనే రోజు ఇదే. మేడారం అభివృద్ధి చేసి 2023 ఫిబ్రవరి 6న మొక్కిన మొక్కును తీర్చుకున్నాం" అని భావోద్వేగంగా అన్నారు. జంపన్నవాగులో నిరంతరం నీరు పారేలా చూస్తామని, రామప్ప, లక్నవరం నుంచి వాగుకు నీరు తరలించే ప్రణాళిక ఉందని సీఎం అన్నారు. సోమవారం ఉదయం సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని ప్రారంభించి భక్తులకు అంకితం చేస్తామన్నారు.

## రిజర్వేషన్లు తేల్చకుండా ఎన్నికలకు వెళ్లడం రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధమని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా ఈ నెల 20 నుంచి నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ర్యాగ రిషి అరుణ్‌కుమార్ అధ్యక్షతన బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 14 బీసీ సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు 28 శాతానికే పరిమితం చేశారని, ఇది అన్యాయమన్నారు. రిషి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుందే తప్ప న్యాయమైన వాటా ఇచ్చేందుకు సిద్ధంగా లేదని మండిపడ్డారు. నీల వెంకటేశ్, సి.రాజేందర్, అనంతయ్య, పగిళ్ల సతీశ్, పి.మోదీ రాందేవ్ యాదవ్, ఎనుగంటి రాజు నేత, అనురాధ, జి.పద్మాగౌడ్, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాలను ప్రోత్సహించేలా సీఎం మాట్లాడటం సిగ్గుచేటు

(మొదటిపేజీ తరువాయి)

నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచకపర్వానికి ద్వారాలు తెరిచింది. రాష్ట్ర ప్రజల్లో గులాబీ జెండాపై ఉన్న చెక్కుచెదరని అభిమానాన్ని చూసి సీఎంకు ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. రెండేళ్ల పాలనలో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెడితేనే చురుగ్గా స్పందించి అరెస్టులు చేసే పోలీసులు.. సీఎం వ్యాఖ్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. భారాసను రాజకీయంగా ఎదుర్కోలేక భాజపాతో కాంగ్రెస్ చీకటి ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర ప్రయోజనాలను పాతాళంలోకి నెట్టిన ముఖ్యమంత్రి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు" అని కేటీఆర్ విమర్శించారు.

## కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉంది. పటాన్ చెరు నియోజకవర్గంలోని 5 మున్సిపాలిటీల్లోని 104 కౌన్సిలర్లను గెలిపించేందుకు విభాగాల వారిగా పని చేద్దామని మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే హాట్ కామెంట్స్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రేవంత్ వ్యాఖ్యలు : హరీశ్‌రావు

**హైదరాబాద్:** ప్రతిపక్ష పార్టీ భారాస జెండా దిమ్మెలను కూల్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగంగా పిలుపునివ్వడమంటే.. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమేనని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. "కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన సీఎం పదవిని ఒక పక్క అనుభవిస్తూనే.. మరోవైపు భాజపాతో రేవంత్‌రెడ్డి చీకటి స్నేహం చేస్తున్నారు. ముఖ్యమంత్రి అయి ఉండి.. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించేలా.. బనకచర్ల వంటి ప్రాజెక్టుల కోసం ఏపీకి సహకరిస్తున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ భాజపాను వ్యతిరేకిస్తుంటే.. భాజపా ప్రభుత్వాన్ని మోస్తున్న తెదేపాపై సీఎం బహిరంగంగా అభిమానం కురిపించడం వెనుక మతలబు ఏమిటి? ముఖ్యమంత్రి చర్యలను తెలంగాణ సమాజం గమనిస్తోంది. భారాస దిమ్మెలు కూలగొడితే.. ప్రజలు గుణపాఠం చెబుతారు" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## మోడీ సర్కార్‌ను గద్దె దించితేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది

(మొదటిపేజీ తరువాయి)

సీఎం హాజరయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా, ముఖ్యనేతలు అమర్‌జీత్‌కౌర్, కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ.. "దేశంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఎర్రజెండా కొట్లాడుతుందని ఖమ్మం గడ్డపై నుంచి నినదించినందుకు కమ్యూనిస్టులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. పేదలు, ఆదివాసీ, గిరిజనుల కోసం నిరంతరం కొట్లాడతామని నినదిస్తున్న కమ్యూనిస్టులను స్ఫూర్తిగా తీసుకొని మొన్నటి ఎన్నికల్లో ప్రభుత్వాన్ని పడగొట్టాం. నేడు ఈ వేదికపై నుంచి ఈ రాష్ట్రాన్నే కాదు.. దేశాన్ని పట్టిపీడి స్తున్న శక్తులను ఓడించడానికి మనం ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరముంది. నాడు బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా నేషనల్ కాంగ్రెస్, కమ్యూనిస్టులు.. కలిసి కొట్లాడితేనే దేశానికి స్వాతం త్ర్యం వచ్చింది. దున్నేవాడిదే భూమి అని ఎర్రజెండా నినదిస్తే.. దాన్ని చట్టం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాముల దగ్గరున్న భూములను పేదలకు పంచింది ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, బూర్గుల రామకృష్ణారావులే. రైతు కూలీలు వెట్టిచాకిరీ చేస్తుంటే.. వాళ్ల హక్కుల కోసం పోరాడింది మీరు. అందుకే కనీస వేతనచ ట్టాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చింది. రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదంటూ రైతుకూలీ సంఘాలను కట్టి మీరు పోరాటాలు చేశారు. దళారులను అడ్డు తొలగించి రైతుకు మద్దతు ధర నిర్ణయించింది కాంగ్రెస్. నాడు రజాకార్లకు, నిజాం నవాబుల కు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్మించి 4,000 మంది ఎర్రజెండా వీరులు నేలకొరిగితేనే హైదరాబాద్ రాష్ట్ర విముక్తికి పునాదులు పడ్డాయి.



భాజపాతో బ్రిటీషర్ల అంతటి ప్రమాదం

నాడు బ్రిటిషర్లతో ఎంత ప్రమాదం ఉండేదో.. నేడు భాజపాతో అంతే ప్రమాదముంది. భాజపా అంటే భారతీయ జనతా పార్టీ కాదు. అది బ్రిటిష్ జనతా పార్టీ. విభజించు.. పాలించు.. పేదవాళ్లను అణగదొక్కు అనే బ్రిటిష్ల ఆలోచనతోనే మనల్ని అణచివేస్తోంది. నాడు నిరుపేదల కోసం కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తెచ్చారు. నేడు అదానీ, అంబానీలకు కూలీలు దొరకడంలేదు. అందుకే మోదీ ప్రభుత్వం 'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేసి రద్దు చేసింది. రైతుకూలీల హక్కులు కాపాడటంతో పాటు కార్పొరేట్ల దోపిడీ ఆగడమే కమ్యూనిస్టులు కోరుకునే నిజమైన స్వేచ్ఛ. అందుకే మీ పోరాటాలకు కాంగ్రెస్ అండగా నిలబడింది.

## మా మంత్రులను బద్నాం చేయొద్దు : సీఎం రేవంత్

**ఖమ్మం:** సింగరేణి టెండర్లలో అవినీతి జరిగిందని కథనాలు వస్తున్నాయని.. తమ ప్రభుత్వంలో అవకతవకలకు తావు లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మధ్దులపల్లి సభలో ఆయన మాట్లాడుతూ.. కోల్ మైనింగ్ టెండర్లు అనుభవరం ఉన్నవారికే ఇస్తామన్నారు. తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. "మీకు మీకు ఉన్న పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు. మా మంత్రులను బద్నాం చేసే ప్రయత్నం చేయొద్దు. ఇలాంటి కథనాల రాసే ముందు మమ్మల్ని వివరణ అడగాలి. మంత్రులపై అవాకులు చవాకులు పేలుతున్నారు. సింగరేణిలో బొగ్గంతా మాయ-ంమైందని కొన్ని పత్రికలు రాస్తున్నాయి. తప్పుడు ప్రచారాలతో అపోహలు సృష్టించొద్దు. మీడియాకు వివరాలు ఇచ్చేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటాను" అని రేవంత్ చెప్పుకొచ్చారు. "మొట్టమొదటి సారి నా రాజకీయ ప్రయాణం ఖమ్మం నుంచి జరిగింది. 20 సంవత్సరాలలో ఖమ్మం ఎప్పుడు వచ్చినా నన్ను అభిమానించారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు కోట్ల పదిహేను లక్షల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం. గత ప్రభుత్వంలో రేషన్ కార్డు ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరికి రేషన్ కార్డు రాకపోయినా అందరికీ ఇవ్వండి. ఉచిత విద్యుత్ మీద మొట్ట మొదటి సంతకం పెట్టింది నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ..వైఎస్సార్ స్ఫూర్తితో ఈనాడు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదు. ఇందిరమ్మ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు ఇచ్చాము. సన్నబియ్యం పథకం, ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం ఖమ్మంలోనే జరిగింది. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో 20 లక్షల కోట్ల రూపాయలు వచ్చాయి. కేసీఆర్ పేదలను దగా చేసిండు తప్ప ఇళ్ళు ఇవ్వలేదు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరం పూర్తి కాకముందే ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ప్రయత్నం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని దోచుకునే వాళ్ల గురువు ఫామ్ హౌస్‌లో ఉన్నాడు.. ఫామ్ హౌస్‌లో ఉండి పేదల ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆలోచన చేస్తున్నాడు. ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. మా ప్రభుత్వంలో అవకతవకలకు తావులేదు. 100 రోజుల్లో సమ్మక్కసారక్క పనులు పూర్తి చేశాం. గత ముఖ్యమంత్రి ఏకపాత్రాభినయం చేశాడు. మేమందరం సమన్వయంతో ప్రభుత్వాన్ని నడుపుతున్నాం. కోల్ మైనింగ్ టెండర్‌లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. ఖమ్మం జిల్లాలో 1130 గ్రామపంచాయతీలు ఉంటే 790 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి. అభిప్రాయ భేదాలను పక్కన పెట్టి అందరూ కలిసి పనిచేయాలి" అని రేవంత్ పిలుపునిచ్చారు.



## సీఎం వ్యాఖ్యలపై పోలీసులు చర్యలు తీసుకోవాలి

### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్

**హైదరాబాద్:** భారాస పార్టీ జెండా దిమ్మెలు కూల్చాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భారాస మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. "కేసీఆర్ స్థాయికి రేవంత్ సరిపోరు. తెలంగాణలో చంద్రబాబుకు ప్రజలు ఏ రకమైన తీర్పునిచ్చారో.. త్వరలో రేవంత్‌రెడ్డికి కూడా ప్రజల నుంచి అదే తీర్పు రానుంది. తెదేపా గురించి సీఎం చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆలోచించాలి" అని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారాస పార్టీ జెండాలను, గద్దెలను కూల్చాలని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, ప్రజాస్వామ్య విరుద్ధమని మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.



## ప్రారంభమైన నాగోబా జాతర

(మొదటిపేజీ తరువాయి)

సన్నాయి మోతలు, డోలు వాయిద్యాలు, దివిటీల కాంతుల మధ్య.. మెస్రం వంశ పెద్దల ప్రత్యేక పూజలతో మహా క్రతువు వైభవంగా సాగింది. ముందుగా గర్భాలయం వెనక ఉంచిన పవిత్ర గంగాజలంతో శుద్ధి కార్యక్రమం చేపట్టారు. అర్ధరాత్రి ఇలవేల్పు శేషసాయికి ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావు, కటోడాలు హన్మంతు, కోసు సహా మెస్రం పెద్దలు ఆంతరంగికంగా నిర్వహించిన అభిషేకంతో మహా పూజలోని ప్రధాన ఘట్టం ముగిసింది. తర్వాత పవిత్ర గంగాజలాన్ని ఆలయ ఆవరణలో వేచి ఉన్న భక్తులపై చల్లటంతో గర్భాలయంలోని నాగదేవత దర్శనం ప్రారంభమైంది. సంప్రదాయ రీతిలో మెస్రం వంశ కొత్త కోడళ్ల భేటీ జరిగింది. అంతకుముందు కేస్లాపూర్‌లోని పాత మందిరమైన మురాఢి నుంచి నాగోబా దేవత ఆభరణాలను ఆలయానికి చేర్చారు. మెస్రం ఆడపడుచులు కొత్త కుండలతో కోనేరు నుంచి తెచ్చిన జలంతో అల్లుళ్లు, మెస్రం మహిళలు మట్టితో పుట్టలు తయారుచేసి పూజలు నిర్వహించారు. మహా పూజకు హాజరైన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్‌కు మెస్రం వంశీయులు తలపాగాలు చుట్టి సన్మానించారు.



## కట్టు కథలకు భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదు

(మొదటిపేజీ తరువాయి)

రాశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టెండర్లు పిలవాలని సింగరేణి సంస్థకు సూచించాం. నేను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిని కాబట్టి.. ఆయనపై ఉన్న కోపం నామీద చూపిస్తున్నారు. ఆ పత్రికలో వచ్చిన కథనం వెనుక రాజకీయ ఉద్దేశం ఏమిటో తెలిశాక పూర్తి వివరాలు వెల్లడిస్తా. గద్దలు, దోపిడీదారులు, వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి తెలంగాణ ఆస్తులను కాపాడతాను. ఒకరి వ్యక్తిత్వాన్ని హననం చేసే కథనాలు రాసే అధికారం ఎవరికీ లేదు. నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు కట్టుకథలు రాశారు. దీనికి భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదు. సింగరేణి ప్రజల ఆస్తి.. బొగ్గుగనులు ప్రజల ఆత్మగౌరవం. పదవుల కోసం కాదు.. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. టెండర్లను పిలిచింది సింగరేణి సంస్థే.. మంత్రి కాదు. క్లిష్ట ప్రాంతాల్లో గనులున్నందున ఫీల్డ్ విజిట్ నిబంధన తప్పనిసరి. ఇలాంటి నిబంధనలు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉన్నాయి. ఓ ఛానల్ కథనంలో నా పేరును అనవసరంగా తీసుకువచ్చారు. మీడియా సంస్థల మధ్య ఉన్న విషయాల్లోకి ప్రజాప్రతినిధులను లాగొద్దు. వ్యక్తిగత వ్యవహారాల జోలికి వెళ్లడం తగదు" అని భట్టి విక్రమార్క అన్నారు.



# భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

## ట్రంప్ సలహాదారు

**యూఎస్ :** భారత్ వంటి ఇతర దేశాల్లో కృత్రిమ మేధ సేవల కోసం అమెరికన్ వనరులను ఉపయోగించడాన్ని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో విమర్శించారు. చాట్‌జీపీటీ వంటి ప్లాట్‌ఫామ్‌లు అమెరికా భూభాగంపై ఇక్కడి విద్యుత్తును ఉపయోగించి పనిచేస్తున్నాయని.. కానీ, భారత్ వంటి దేశాల్లో పెద్ద సంఖ్యలో వినియోగదారులకు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. ఓ అమెరికన్ ఛానల్‌లో వైట్ హౌస్ మాజీ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో నవారో ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. "భారత్‌లో ఏఐ సేవల కోసం అమెరికన్లు ఎందుకు డబ్బులు చెల్లిస్తున్నారు? చాట్‌జీపీటీ (జష్ఘ్‌+ూ) అమెరికా గడ్డపై పనిచేస్తోంది. ఇక్కడి విద్యుత్తును ఉపయోగిస్తోంది. కానీ, భారత్, చైనా ఇలా ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో పెద్దఎత్తున వినియోగదారులకు సేవలు అందిస్తోంది" అని నవారో వ్యాఖ్యానించారు. అదే విధంగా అమెరికాలో వ్యవసాయ భూముల కొనుగోళ్లపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు స్థానిక వ్యవసాయ భూములను వాస్తవ ధర కంటే పది రెట్లు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి ధోరణులు అమెరికాలో ఆహార ధరల పెంపునకు కారణం కావొచ్చన్నారు. అమెరికాతో వాణిజ్యం, రష్యాతో కొనసాగిస్తున్న విధానాలపై భారత్‌ను లక్ష్యంగా చేసుకుని నవారో గతంలోనూ పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు. భారత్ అత్యధిక సుంకాలు విధించడం వల్ల అమెరికా ఉద్యోగాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. లాభం కోసమే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, ఉక్రెయిన్‌తో మాస్కో చేస్తున్న యుద్ధాన్ని పోషిస్తోందని నోరు పారేసుకున్నారు. భారత్ ఈ వ్యాఖ్యలను కొట్టిపారేసింది. రష్యా నుంచి తాము చమురు కొనుగోలు చేస్తోంది కేవలం ఇంధన భద్రత కోసమేనని పేర్కొంది.



# ఆరుగురు మావోయిస్టులు మృతి

**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య ఎలియాస్ పాపారావు.. నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారని నిఘావర్గాలకు సమాచారం అందడంతో బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. ఓ మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో దిలీప్ బెడ్జా ఉన్నట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో ఇవాళ జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, 303 రైఫిల్, ఇన్సాస్, రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



# పారాసిటమాల్‌తో ఆటిజం ముప్పు రాదు

**దిల్లీ:** గర్భధారణ సమయంలో పారాసిటమాల్ వాడటం వల్ల శిశువుల్లో ఆటిజం, మేధో వైకల్యం, అతి చురుకుదనం(అటెన్షన్ డెఫిసిట్– హైపర్ ఆక్టివిటీ డిజార్డర్) వంటి సమస్యలు వస్తాయనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఈ వివరాలు 'ద లాన్సెట్ అబ్‌స్టేట్రిక్స్, గైనకాలజీ, ఉమెన్ హెల్త్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. "గర్భధారణ సమయంలో వైద్యుల సలహా మేరకు పారాసిటమాల్ తీసుకున్న వారి పిల్లల్లో ఆటిజం, మేధో వైకల్యం, అతి చురుకుదనం వంటి సమస్యలు రావని ఆధారాలు సూచిస్తున్నాయి. దాని భద్రతపై ఇప్పటికే ఉన్న సిఫార్సుకు మరింత మద్దతునిస్తున్నాయి. పారాసిటమాల్ వాడిన, వాడని పలువురు గర్భిణిల ఆరోగ్య నివేదికలను పరిశీలించినపుడు.. గర్భధారణ సమయంలో పారాసిటమాల్ తీసుకోవడం వల్ల ఆటిజం రుగ్మత ప్రమాదం లేదని తెలిసింది. గర్భిణిలకు అసౌకర్యం, అంతర్లీన నొప్పి, జ్వరం వంటివి వచ్చినప్పుడు వైద్యులే పారాసిటమాల్‌ను సూచిస్తారు. గర్భధారణ సమయంలో పారాసిటమాల్ వాడటం వల్ల పిండం మనుగడ, నరాల అభివృద్ధికి హాని కలుగుతుందని చెప్పేందుకు నిర్దిష్ట ఆధారాలు లేవు" అని పరిశోధనలో వెల్లడైంది.

# 'చైనా, రష్యాలు పండగ చేసుకుంటున్నాయి'

## ట్రంప్ సుంకాలపై ఈయూ ఖండన

**ఈయూ :** గ్రీన్‌లాండ్ విషయంలో తమ విధానాన్ని వ్యతిరేకిస్తున్న 8 ఐరోపా దేశాలపై 10 శాతం అదనపు సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని ఐరోపా దేశాలు తీవ్రంగా ఖండించాయి. తప్పుడు చర్యగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ స్పందిస్తూ.. ట్రంప్ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. మరోవైపు.. అమెరికా తీరుకు వ్యతిరేకంగా గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌లలో వేలాది మంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. "నాటో సభ్యదేశాలుగా గ్రీన్‌లాండ్ భద్రత కోసం చర్యలు తీసుకుంటే.. సుంకాలు విధిస్తామని హెచ్చరించడం పూర్తిగా తప్పు. ఈ విషయాన్ని నేరుగా అమెరికా యంత్రాంగంతో తేల్చుకుంటాం" అని కీర్ స్టార్మర్ అన్నారు. "సుంకాల బెదిరింపులు ఆమోదయోగ్యం కాదు. ఎటువంటి బెదిరింపులకు లొంగేది లేదు" అని మెక్రాన్ వ్యాఖ్యానించారు. "చైనా, రష్యా పండగ చేసుకుంటున్నాయి. మిత్రదేశాల మధ్య విభేదాల వల్ల ప్రయోజనం పొందేది ఆ దేశాలే"నని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ పేర్కొన్నారు. తమను బ్లాక్‌మెయిల్ చేయలేరంటూ స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాన్ని కాపాడుకునే విషయంలో ఈయూ ఎల్లప్పుడూ దృఢంగా ఉంటుందని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అన్నారు. ట్రంప్ ప్రకటన ఆశ్చర్యకరమని డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లోకే రాస్‌ముస్సేన్ తెలిపారు. తమ దేశ భద్రత విషయంలో గ్రీన్‌లాండ్ ఎంతో ముఖ్యమని, దాన్ని స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. ఈ ప్రాంతం డెన్మార్క్ నియంత్రణలో ఉంది. ఈ నేపథ్యంలో ఐరోపా దేశాలు డెన్మార్క్‌కు మద్దతుగా నిలిచాయి. గ్రీన్‌లాండ్ భద్రత 'నాటో' ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, నెదర్లాండ్స్, బ్రిటన్‌లు అక్కడికి బలగాలను తరలించాయి. ఈ పరిణామాల నడుమే డెన్మార్క్‌తోపాటు ఈ ఏడు దేశాలపై ట్రంప్ 10 శాతం అదనపు సుంకం ప్రకటించారు.



# ఖమేనీ గద్దె దిగాల్సిన సమయం వచ్చింది : ట్రంప్

**యూఎస్ :** ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఇరాన్ ప్రజలపై దాడులు జరుగుతున్నాయన్నారు. అక్కడ కొనసాగుతోన్న హింసకు ఖమేనీనే కారణమని ఆరోపించారు. నాయకుడి స్థానంలో ఉన్న ఖమేనీ వేలాది మంది ప్రజలను చంపుతూ.. తన దేశాన్ని తనే నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు ఆయనకు నాయకత్వం కట్టబెట్టింది ఇటువంటి భయాలు, మరణాలు సృష్టించడానికి కాదని అన్నారు. ఇంతమంది ప్రాణాలు తీసిన సుప్రీం లీడర్ ఇరాన్‌ను పాలించడానికి అనర్హుడని పేర్కొన్నారు. ఇక ఆయన అధికారం నుంచి దిగిపోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవాలని ఆ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇరాన్‌లో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఖమేనీ ఆరోపించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. శనివారం ఖమేనీ మాట్లాడుతూ.. దేశంలో నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్నారు. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారేనని తెలిపారు. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడమే లక్ష్యంగా ఈ కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు.



### ఆందోళనలు కొనసాగించండి: యువరాజు రెజా పహ్లావి

ఇరాన్‌లో కొనసాగుతోన్న నిరసనలు మరింత తీవ్రం చేయాలని ప్రవాసంలో తలదాచుకున్న ఆ దేశ యువరాజు రెజా పహ్లావి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా వీధుల్లోకి వచ్చి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలన్నారు. ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అండగా ఉంటారని పేర్కొన్నారు. మరోవైపు ఆ దేశంలో కొనసాగుతోన్న హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

# రూ.5 వేలతో ఆశపెట్టి.. రూ.2.9 కోట్లు స్వాహా

## ఐటీ ఉద్యోగిని మోసగించిన సైబర్ నేరగాళ్లు

**హైదరాబాద్:** స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే 300 శాతం లాభం వస్తుందని ఆశపెట్టిన సైబర్ నేరగాళ్లు.. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.2.9 కోట్లు కొట్టేశారు. తొలిసారి పెట్టుబడికి అదనంగా రూ.5 వేలు ఇవ్వడంతో.. నిజంగానే లాభాలు వస్తాయని నమ్మిన ఉద్యోగి అప్పులు చేసి పలు దఫాలుగా డబ్బు బదిలీ చేశారు. చివరకు మోసపోయినట్లు గ్రహించి సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదివ్వగా కేసు నమోదైంది. హైదరాబాద్ శేరిలింగంపల్లికి చెందిన ఐటీ నిపుణుడి(45)కి గతేడాది నవంబరు 12న వాట్సప్‌లో ఒక వెబ్‌లింక్ వచ్చింది. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు సలహాలిస్తామని లింకులో ఉంది. లింకును క్లిక్ చేసి వాట్సప్ గ్రూపులో చేరారు. అనిల్ గోయల్ అనే వ్యక్తి ఈయన్ను పరిచయం చేసుకున్నాడు. షేర్ల గురించి సలహాలు తీసుకుని ఎంతోమంది డబ్బు సంపాదించారంటూ స్క్రీన్‌షాట్లు పోస్టు చేసేవాడు. గ్రూపులోని ప్రతి ఒక్కరూ 300 శాతం లాభాలు పొందవచ్చని నమ్మించాడు. ఇది నిజమేనని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నమ్మి.. వారు చెప్పినట్లుగా యాప్ డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. డిసెంబరు 15న తొలిసారి రూ.50 వేలు పెట్టుబడి పెట్టగా.. రూ.5 వేలు లాభం వచ్చింది. దీంతో పలుమార్లు మొత్తం రూ.2.9 కోట్లు బదిలీ చేశారు. పెట్టుబడి, లాభం కలిపి రూ.3.47 కోట్లకు చేరినట్లు యాప్‌లో వర్చువల్‌గా కనిపించేది. అప్పటికే రుణభారం పెరగడంతో షేర్లలో కొన్నింటిని విక్రయించి అప్పు తీర్చాలనుకున్నారు. ఈ విషయమై వాట్సప్ గ్రూపులో సలహాలిచ్చిన అనిల్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. విక్రయించడం సాధ్యం కాదని చెప్పాడు. అదనంగా డబ్బు చెల్లించాలనడంతో.. తాను మోసపోయానని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.

# మౌని అమావాస్య పుణ్యస్నానాలు

## త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తులు



**యూపీ :** మౌని అమావాస్య సందర్భంగా ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణిసంగమ స్థలిలో కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సాయంత్రానికే వారి సంఖ్య 4.52 కోట్లు దాటిందని ఉత్తర ప్రదేశ్ అధికారులు వెల్లడించారు. దట్టంగా కమ్ముకున్న పొగమంచును, వణికించే చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు శనివారం అర్ధరాత్రి కల్లా త్రివేణి సంగమ ఘాట్లకు చేరుకున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులపై హెలికాప్టర్ ద్వారా గులాబీ రేకుల వర్షం కురిపించారు. ఇటీవల మకర సంక్రాంతి సందర్భంగా సంగమంలో కోటి మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు చేయగా ఏకాదశి రోజున 85 లక్షల మంది పుణ్యస్నానాలు చేశారు. "భిన్న మార్గాల నుంచి వస్తున్న భక్తులు నచ్చిన ఘాట్‌కు చేరుకునేందుకు వీలుగా మార్గసూచీలు ఏర్పాటుచేశాం. భక్తులకు సాయపడేందుకు పెద్ద సంఖ్యలో పౌర వలంటీర్లను రంగంలోకి దించాం. మాఘ మేళా ప్రాంతమంతటా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేశాం. 800 హెక్టార్లలో జరుగుతున్న మేళాను ఏడు సెక్టార్లుగా విభజించాం. 25,000 మరుగుదొడ్లను నిర్మించాం. శుభ్రతా కార్యక్రమాల కోసం 3,500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు" అని డివిజనల్ కమిషనర్ సౌమ్యా అగర్వాల్ చెప్పారు. స్వల్పకాలిక కల్పవాస్ దీక్ష కోసం, మేళాను తిలకించేందుకు విచ్చేసే లక్షలాది మంది విదేశీ పర్యాటకులు, సందర్శకుల కోసం యూపీ సర్కారు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. "వారికోసం టెంట్ సిటీ నిర్మించాం. ధ్యానం, యోగాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. వృద్ధులు, అలసిపోయిన భక్తులు వెంటనే తిరుగుపయనం అయ్యేందుకు వీలుగా బైక్ ట్యాక్సీలు, గోల్ఫ్ కార్ట్ వాహనాలనూ సిద్ధంగా ఉంచాం" అని సౌమ్య పేర్కొన్నారు.



# 'మహా జంగిల్ రాజ్'కు ముగింపు పలుకుతాం : ప్రధాని మోదీ

**పశ్చిమబెంగాల్ :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విమర్శలు చేశారు. మమత పాలనలో బెంగాల్‌లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయన్నారు. తమ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను బెంగాల్ ప్రజలకు అందకుండా మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ప్రధాని ఆరోపిం చారు. వీరితో విసిగిపోయిన ప్రజలు భాజపా వైపు చూస్తున్నారన్నారు. బిహార్‌లో జంగిల్ రాజ్‌కు తగిన బుద్ధి చెప్పినట్లే.. 2026 ఎన్నికల్లో 'మహా జంగిల్ రాజ్'కు ముగింపు పలుకుతామన్నారు. సింగూర్‌లో నిర్వహించిన సభలో ప్రధాని మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం చొరబాటుదారులకు మద్దతిస్తూ.. దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టేస్తోందన్నారు. బెంగాల్ సరిహద్దులను కాపాడుకోవాలంటే సొంత ప్రయోజనాల కోసం కాకుండా దేశాభివృద్ధి కోసం పని చేసే ప్రభుత్వం కావాలన్నారు. బెంగాల్‌లో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమికొడతామని హామీ ఇచ్చారు.

### డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే మహిళలకు భద్రత

బెంగాల్‌లోని బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల్లో మహిళలపై లైంగిక వేధింపుల ఘటనలు తరచుగా వెలుగులోకి వస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు భద్రత అవసరమని పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మాత్రమే ప్రజలకు రక్షణ, న్యాయం అందిస్తుందని అన్నారు.



# రూ.7 చోరీ కేసు.. 50 ఏళ్లకు తీర్పు

**ముంబాయి :** మహారాష్ట్రలో 50 ఏళ్ల నాటి ఓ చోరీ కేసుకు ఎట్టకేలకు తెరపడింది. ఇద్దరు నిందితులతోపాటు ఫిర్యాదుదారుడి గురించి పోలీసులు అనేక ఏళ్లుగా వెతుకుతున్నప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. దీంతో ఈ కేసుకు ముగింపు పలుకుతున్నట్లు స్థానిక న్యాయస్థానం పేర్కొంది. దక్షిణ ముంబయిలోని మజగావ్ న్యాయస్థానం పాత కేసులపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా 1977 నాటి రూ.7.65 చోరీ కేసు పెండింగులోనే ఉంది. అప్పట్లో ఇది పెద్ద మొత్తమనే చెప్పవచ్చు. అయితే, ఇందులో ఇద్దరు నిందితులను పట్టుకునేందు కు పోలీసులు అనేకమార్లు నాన్–బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. అయినప్పటికీ వారి ఆచూకీ తెలియలేదు. దీంతో ఈ కేసు దశాబ్దాలుగా మరుగునపడిపోయింది. ఈ కేసును ఇటీవల విచారించిన న్యాయస్థానం.. దాదాపు యాభై ఏళ్ల నాటి ఈ కేసులో ఎటువంటి పురోగతి లేదని.. అలాంటప్పుడు దీన్ని పెండింగ్‌లో ఉంచడంలో అర్థం లేదని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా నిందితులపై ఉన్న అభియోగాలను కొట్టివేసిన న్యాయస్థానం.. రికవరీ చేసిన రూ.7.65లను ఫిర్యాదుదారుడికి ఇవ్వాలని ఆదేశించింది. అప్పీలు గడువు ముగిసేనాటికి.. ఫిర్యాదుదారుడి ఆచూకీ లభించకపోతే ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని ఆదేశించింది.




# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

## అత్యవసర ల్యాండింగ్

**లఖ్‌నవూ:** దిల్లీ నుంచి బెంగాల్‌లోని బాగ్‌డోగరా బయల్దేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. దీంతో విమానాన్ని లఖ్‌నవూలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 238 మంది ప్రయాణికులతో ఎయిరిండియా విమానం దిల్లీ నుంచి బాగ్‌డోగరాకు బయల్దేరింది. విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై విమానంలో బాంబు పెట్టినట్లు రాసి ఉన్న బెదిరింపు నోట్‌ని సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు లఖ్‌నవూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. దీంతో లఖ్‌నవూ విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించేశారు. అనంతరం విమానంలో తనిఖీలు చేశారు. విమానాన్ని టెర్మినల్ ప్రాంతంలో ఉంచినట్లుగా అధికారులు తెలిపారు. ప్రయాణికులు తమ గమ్యస్థానాలను చేరడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మం డలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన సుద్దాల బాల్ నర్స్ వారి కుమారుడు కి 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గంధ్ర అంజయ్య, వార్డు సభ్యులు రాజమణి, బండి పోచయ్య, బాలరాజు, రగోతం రెడ్డి, పాల్గొన్నారు అందజేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స సుద్దాల బాల్ నర్స్ కూ ముఖ్య మంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ 60వేల చెక్కును అందజేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



## ఉప్పల్వాయి సర్పంచి భర్తకు సన్మానం

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** మండలంలోని ఉప్పల్వాయి గ్రామం సర్పంచి భర్త కనుకంటి రాజేందర్ కు మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిద్ద మైసమ్మ వద్ద ఘనంగా సన్మానించారు.



## దైవ దర్శనం చేసుకున్న భక్తులు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలోని ఆదివారం ఉదయం గ్రామం నుండి మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర ఆలయం వరకు భక్తులు కాలినడకన వెళ్లడం జరిగింది. తదుపరి బుగ్గ రామలింగేశ్వర ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పుణ్యస్నానాలు,ఈ యొక్క అమావాస్య సందర్భంగా బుగ్గ రామలింగేశ్వర ఆలయం వద్ద పుణ్యస్నానాలు ఆచరించడం శ్రేష్టంగా భావించి స్వామి వారి దర్శనం తదుపరి తీర్థప్రసాదాలు తీసుకొని తిరుగు ప్రయాణం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండల కేంద్రంలోని ఈసన్నపల్లి- రామారెడ్డి గ్రామాలలో కొలువైన పుణ్యక్షేత్రం శ్రీ కాలభైరవ స్వామి వారికి మాఘమా అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అమావాస్య సందర్భంగా స్వామివారికి అంగరంగ వైభవంగా స్వామివారిని అందంగా ముస్తాబు చేసి భక్తులకు ప్రజలకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# వరద నీరు మళ్లించేందుకు
# మున్నేరు పాలేరు లింక్ కెనాల్

- సీఎం రేవంత్ రెడ్డి
- 162.54 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు శంఖుస్థాపన
- మూడు జిల్లాలకి వరప్రదాయనిగా మారనున్న ప్రాజెక్టు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారీ వర్షాలుకు సంభవించే వరద నీరు వృథా కాకుండా 9.6 కిలోమీటర్ల పొడవైన లింక్ కాలువ ద్వారా నేరుగా వరద రూపంలో పాలేరు రిజర్వాయర్ కు మళ్లించేందుకు మున్నేరు-పాలేరు లింక్ కాలువ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి గ్రామంలో 162.54 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మున్నేరు-పాలేరు లింక్ కాలువ పనులకు రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఖమ్మం జిల్లాలోని పాలేరు దిగువ భాగంలో ఉన్న నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని 1.38 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి స్థిరీకరణ జరుగుతుందని,సూర్యాపేట జిల్లాలోని ఎగువ భాగంలో ఉన్న మరో 40,000 వేల ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు.అంతేగాకుండా ఎసచవతీతీచరచవతీతీచస్ప్ పేజ్-2 బలోపేతం అవ్వడంతో పాటు కాలానుగుణంగా సుమారుగా డెబ్బై వేల ఎకరాలకు లబ్ది చేకూరుతుందని చెప్పారు.167 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు బహుళప్రయోజనాలతో కూడుకున్నదని తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగిలే ముందుచూపుతో దీనిని రూపొందించడం జరిగిందని తెలిపారు.ఈ నిర్మాణం పూర్తయితే పాలేరు దిగువన ఉన్న ప్రస్తుత హైడల్ ప్రాజెక్ట్ ద్వారా 2 మేఘవాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. దీనికి తోడు వరదల సమయంలో ఖమ్మం,సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో సంభవించే వరద ముంపు వల్ల జరిగే ప్రమాదం నుండి బయట పడవచ్చున్నారు.

### మూడు జిల్లాల కొత్త ఆయకట్టుకు నీరు అందిస్తాం:మంత్రి ఉత్తమ్

జనవరి,2027 నాటికి మున్నేరు-పాలేరు లింక్ కాలువ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రాజెక్టును ప్రారంభించి మూడు జిల్లాలకు ఆయకట్టు స్థిరీకరణతో పాటు కొత్త ఆయకట్టుకు నీరు అందిస్తామని పేర్కొన్నారు.తక్కువ వ్యయంతో ఎక్కువ ప్రయోజనం పొందేలా రూపొందించిన ఈ ప్రాజెక్టు ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు వరప్రదాయనిగా మరనుందన్నారు. వరదలు సంభవిస్తున్న సమయంలో వృధాగా సముద్రంలో కలుస్తున్న అదనపు నీటిని 9.6 కిలోమీటర్ల పొడవైన లింక్ కాలువ ద్వారా నేరుగా వరద రూపంలో పాలేరు రిజర్వాయర్ కు మళ్లించడమే ప్రభుత్వ ముఖ్యోద్దేశమని ఆయన తెలిపారు.ఈ ప్రాజెక్టు నీటిని వినియోగించడం ద్వారా సీతారామ ఎత్తిపోతల పథకానికి అవుతున్న 120 కోట్ల విద్యుత్ చార్జీల భారం నుండి బయట పడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క,మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇంచార్జీ మంత్రి వాకిటి శ్రీహరి,ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, మల్లు రవి,ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్,మట్టా రాగమయి,కోరం కనకయ్య,పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు,అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి,మద్దులపల్లి మార్కెట్ కమిట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు,వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి,పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ,పార్టీ శ్రేణులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# లక్కీడ్రాల పేరుతో
# మోసాల పట్ల జాగ్రత్త

### సామాజిక మాధ్యమాల్లో లక్కీడ్రాల పేరుతో మోసాలు
### సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై రాష్ట్ర వ్యాప్తంగా కఠిన చర్యలతో ఆ దందాకు దాదాపు బ్రేక్ పడటంతో, ఇప్పుడు కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సోషల్ మీడియా వేదికగా "లక్కీ డ్రా" పేరుతో కొత్త మోసాలకు తెరలేపుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పి కోరారు. కార్లు, బైకులు, ఖరీదైన గ్యాడ్జెట్లు ఇస్తామంటూ అమాయక ప్రజలను ఆకర్షించి నగదు దోచుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో లక్కీ డ్రా పేరుతో జరుగుతున్న మోసాలపై రాష్ట్రంలో కొన్ని ముఖ్య నగరాల్లో, పట్టణాల్లో పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలు తమ ఫాలోయింగ్‌ను ఉపయోగించి" డ్రాలో పాల్గొంటే కచ్చితంగా బహుమతి" అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి డ్రాలకు ఎలాంటి చట్టబద్ధత లేదు. బహుమతులు అందకుండా ప్రజలు మోసపోవడమే జరుగుతోందని స్పష్టం చేశారు. లక్కీ డ్రా పేరుతో డబ్బులు వసూలు చేయడం, ప్రజలకు లాభాల ఆశ చూపించి మోసం చేయడం నేరమని అన్నారు. ఈ తరహా కార్యకలాపాలు ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (బ్యానింగ్) యాక్ట్, 1978 కింద



నేరంగా పరిగణించబడతాయని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమించి లక్కీ డ్రాలు నిర్వహించే వారిపై, వాటిని ప్రమోట్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఇలాంటి వాటిని నిర్వహించిన, ప్రోత్సహించిన ఎంతవారిపైనైనా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు



## కూసుమంచిలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలుగుదేశం పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటి చెప్పిన మహనీయుడు ఎన్‌టీఆర్ అని ఆపార్టీ కూసుమంచి మండల అధ్యక్ష,కార్యదర్శిలు మందపల్లి కోటేశ్వరావు,నలగాటి రామనాథం అన్నారు.మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంతి ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలను ఆదివారం టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి వారు ఘన నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని పేద,బడుగు,బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారని ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో వజ్ర హాస్పిటల్ చైర్మన్,టీడీపీ జిల్లా నాయకులు ఇంటూరి నాగరాజు చౌదరి,మండల ఉపాధ్యక్షుడు ఆడపా శివ,తెలుగుయవత అధ్యక్షుడు ఉప్పల ఉదయ్,రైతు సంఘం అధ్యక్షుడు తాళ్లూరి భాస్కరరావు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోవింద ఎల్లయ్య,మండల బీసీ సెల్ అధ్యక్షులు మల్లబోయిన పిట్టయ్య, పార్టీ శ్రేణులు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్పీరియం పార్కు పేరుతో భూ దోపిడి

- ఐదు సంవత్సరాల లీజు పేరుతో రైతులను మోసం చేసిన వైనం
- తమకు న్యాయం చేయాలంటున్న రైతులు

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు గ్రామంలో "ఎక్స్పీరియం పార్క్" పేరుతో జరుగుతున్న భూ దోపిడీ వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. ఇది కేవలం ఒక గ్రామానికి సంబంధించిన భూ వివాదం కాకుండా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పేదల హక్కులు, చట్టపాలన వైఫల్యంపై గంభీరమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రభుత్వ భూములు, నిరుపేద దళిత రైతుల భూములు లక్ష్యంగా సాగుతున్న అక్రమాలపై రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పొద్దుటూరు గ్రామానికి చెందిన దళిత రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న సర్వే నంబర్ 305లోని ఒక ఎకరం 20 గుంటల భూమి ఈ వివాదానికి కేంద్రంగా మారింది. 2020లో రాందేవ్ రావు అనే వ్యక్తి "బొమ్మలు తయారు చేస్తాం, చిన్న పార్క్ ఏర్పాటు చేస్తాం, ఐదేళ్లు మాత్రమే లీజు" అంటూ రైతులను నమ్మించాడని బాధితులు చెబుతున్నారు. చదువు లేని తమ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కాగితాలపై సంతకాలు తీసుకున్నాడని, కానీ ఆ ఒప్పందపు కాపీ ఇవ్వకపోగా, డబ్బులు కూడా పూర్తిగా చెల్లించలేదని వారు వాపోతున్నారు. ఐదేళ్ల గడువు పూర్తయ్యే సమయానికి భూమి తిరిగి ఇవ్వాలని కోరితే, తమకు తెలియకుండానే 99 సంవత్సరాల లీజు అగ్రిమెంట్ చేసినట్టుగా నకిలీ డాక్యుమెంట్లు చూపించి బెదిరింపులకు పాల్పడుతున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. "ఇది మీ భూమి కాదు" అంటూ భూమిలోకి వెళ్తే దూషణలు, హెచ్చరికలు చేస్తున్నారని తెలిపారు. ఇదంతా చాలదన్నట్లుగా, రాత్రికి రాత్రే భారీ యంత్రాలతో 30 నుంచి 50 ఫీట్ల లోతైన గుంతలు తవ్వి భూమిని నిర్వీర్యం




చేశారని, ఇది గ్రామ భద్రతకే ముప్పుగా మారిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొద్దుటూరు పెద్ద చెరువులోకి వచ్చే వరద కాలువను కూడా మూసి వేయడంతో వర్షాకాలంలో గ్రామంలోకి వర్షం నీరు చేరితే ఎలా అనే భయం నెలకొందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాలన్నీ 111 జి ఓ పరిధిలో, పి ఓ టి (గూు) యాక్ట్‌ను తుంగలో తొక్కుతూ జరుగుతున్నా, రెవెన్యూ అధికారులు మాత్రం "సర్వే చేస్తాం" అనే మాటలతో కాలయాపన చేస్తున్నారని బాధితుల ఆవేదన. అక్రమ నిర్వాహకులు "తమకు సిఎం తెలుసు, పెద్దలతో పరిచయాలున్నాయి" అంటూ బహిరంగంగా బెదిరించడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. దళిత రైతులపై ఇంత అన్యాయం జరుగుతుంటే దళిత సంఘాలు, నాయకులు మౌనం వహించడం కూడా తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. "మా భూమి మాకు ఇవ్వకపోతే ఇదే గుంతలో పడి చనిపోతాం" అనే మాటలు బెదిరింపుగా కాకుండా, తమ బతుకులు ఏ అంచున నిలిచాయో తెలిపే ఆర్తనాదంగా గుర్తించాలని బాధితులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర దర్యాప్తు చేసి, అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుని, బాధితులకు తగిన న్యాయం చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



## ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన మాదిరి పృథ్వీరాజ్

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** తెలుగుజాతి కి గర్వకారణం, మహానాయకుడు ఎన్టీఆర్ అని పఠాన్ చెరువు బి ఆర్ ఎస్ పార్టీ యువ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పటాన్ చెరువు పట్టణం గౌతమ్ నగర్ కాలనీ సీతారామయ్య కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పృధ్వి రాజ్ పాల్గొని నివాళులు అర్పించారు.

## దివ్యాంగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి మరోసారి స్పష్టం

### డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పర్ష శ్యామ్ రావు



**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉందని మరోసారి నిరూపించిందని సంగారెడ్డి జిల్లా డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పర్ష శ్యామ్ రావు అన్నారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకాన్ని గతంలో ఉన్న రూ. లక్ష నుండి రూ. 2లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయం అని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పాలనకు కాంగ్రెస్ ప్రభుత్వం నిదర్శనంగా నిలుస్తోందని తెలిపారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోబోతుందని, బిజెపి పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రేవంత్ రెడ్డి సారధ్యంలోని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేస్తుందని, ప్రజలకు నమ్మకం ఏర్పడిందని ఒక ప్రకటనలో శ్యామ్ రావు తెలిపారు.



## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య క్యాలెండర్ ఆవిష్కరణ

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్ :** ఆత్మకూర్ (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన సర్పంచ్ తండ మంజుల నర్సింహా గౌడ్. మాజీ జడ్పీటీసీ నరేందర్ గుప్తా. మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి. ఈ కార్యక్రమం లో వార్డు మెంబర్ సుదర్శన్. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లారెడ్డి మాజీ వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ ఎస్ యూ ఐ నాయకులు సిపిఐ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన పంపు మోటారు బిగించిన సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్

**ఆత్మకూర్(ఎం) రాజముద్ర న్యూస్:** ఆత్మకూర్( ఎం) మండల కేంద్రంలోని( కొత్తగూడెం) 4 వ వార్డ్ పరిధిలోని నాగం ఇస్తారి ఇంటి ముందు గల బోరు గత సంవత్సరం కాలం నుండి పాడైపోయి నిరుపయోగంగా ఉండటం గమనించిన సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ .కాలనీవాసుల అవసరాల నిమిత్తం ఈరోజు రూ.. 45,000 (నలభై ఐదు వేల రూపాయలు) వెచ్చించి కొత్త మోటరు పంపు బిగించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది,కాలనీవాసులు పాల్గొన్నారు



## వీధిలైట్ల లైట్ల ఏర్పాటుతో గ్రామాల్లో వెలుగులు

### సర్పంచ్ మారెపల్లి భాగ్యలక్ష్మి పాపారావు

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ఎల్వర్తి, కొజ్జగూడ గ్రామాలు వెలుగులతో కొత్త శోభతో కళకళలాడుతున్నాయని గ్రామ సర్పంచ్ మారేపల్లి భాగ్యలక్ష్మి పాపారావు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధియే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, అందులో భాగంగానే నేడు వీధిలైట్ల ఏర్పాటు కార్యక్రమం చేపట్టామని ఆమె అన్నారు. ఆదివారం రోజు ఎల్వర్తి, అనుబంధ గ్రామమైన కొజ్జగూడ గ్రామాలలో సుమారు 150 లైట్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రతి వీధి చీకటి లేకుండా ఉండాలనే ఉద్దేశంతో నాణ్యమైన లైట్లను అమర్చినట్లు తెలిపారు. దీనివల్ల రాత్రి సమయాల్లో ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు, వృద్ధులకు రాకపోకలకు సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కాంత్ రెడ్డి, పార్టీ ప్రెసిడెంట్ ఆర్ వెంకట్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ విక్రం రెడ్డి, గ్రామ పెద్దలు మహందర్ రెడ్డి, చెన్నారెడ్డి, వెలిమెల మల్లన్న, జగన్ మౌళి, గోపాల్, వార్డు సభ్యులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని లైట్ల ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

- నర్సింగ్ కళాశాలలో జపనీస్, జర్మన్ భాషలు నేర్పేందుకు చర్యలు
- 108 కోట్ల 60 లక్షలతో నిర్మించే జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు శంకుస్థాపన
- 162 కోట్ల 54 లక్షలతో మున్నేరు నుండి పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- 45 కోట్ల 50 లక్షలతో కూసుమంచి 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన
- 25 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు ప్రారంభోత్సవం
- 19 కోట్ల 90 లక్షల 50 వేలతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రారంభోత్సవం
- ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వాకాటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ఘన స్వాగతం పలికారు. పాలేరు నియోజకవర్గ పరిధి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో 108 కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నూతన భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. కూసుమంచిలో 5 ఎకరాల విస్తీర్ణంలో 45 కోట్లతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, 162 కోట్ల 54 లక్షలతో మున్నేరు పాలేరు లింక్ కేనాల్ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే 25 కోట్ల రూపాయలతో 5 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాలను, మద్దులపల్లిలో 23 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 20 కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డును ప్రారంభించారు. అనంతరం నర్సింగ్ కళాశాలలో విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థినులకు నర్సింగ్ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. సమాజంలో వైద్య రంగానికి అత్యంత విలువ ఉందని, ఆపద సమయంలో ప్రజలు నమ్మకంతో ఆసుపత్రులకు వస్తారని, విధుల నిర్వహణలో చిన్న నిర్లక్ష్యం చూపిన ప్రాణ నష్టం, ఒక కుటుంబం జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉంటుందని, కాబట్టి విధి నిర్వహణలో వ్యక్తిగతం గా ఉన్న ఇబ్బందులు, సమస్యలను పక్కన పెట్టాలని అన్నారు. విధుల నిర్వహణలో బాధ్యతతో నర్సులు పని చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా విదేశాలలో కూడా బీఎస్సి నర్సింగ్ చదివిన విద్యార్థులకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. గతంలో ఇంజనీరిం గ్ చదివిన వారికి విదేశాలలో ఎక్కువ అవకాశాలు దక్కాయని, నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని వైద్య రంగంలో అనేక ఉపాధి అవకాశాలు విదేశాలలో ఉన్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా పర్యటనలో అక్కడ లక్షలాదిగా నర్సుల కొరత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. జపాన్ లో ఏజింగ్ సమస్య వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మన నర్సింగ్ విద్యార్థులకు అక్కడ సాఫ్ట్వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువ జీతభత్యాలతో ఉపాధి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. మన విద్యార్థులకు అక్కడి భాష, సంస్కృతి నేర్పెందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నర్సింగ్ కళాశాలలో జపనీస్, జర్మన్ భాషలు నేర్పేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని అన్నారు. జపాన్, జర్మనీ ప్రభుత్వాలతో తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ఒప్పందాలు చేసుకున్నట్లు సీఎం తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఆదర్శవంతంగా విధులు నిర్వహించాలని, నర్సింగ్ విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు సీఎం తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు మంజూరు చేసి నర్సింగ్ కళాశాల నిర్మించామని, ఇక్కడ చదివే విద్యార్థినులను దృష్టిలో పెట్టుకుని అవసరమైన అన్ని మౌళిక వసతులను కల్పించడం జరిగిందని అన్నారు. రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత నర్సింగ్ కళాశాలతో పాటు హాస్టల్ భవనాల ను అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ మంచి సదుపాయాలతో నిర్మించడం జరిగిందని , దీనికి సహకరించిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం లకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నర్సింగ్ విద్యార్థినులు మాట్లాడుతూ, మంచి నర్సింగ్ కళాశాల భవనం అందించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందించిన సదుపాయాలను వినియోగించు కుంటూ భవిష్యత్తులో వైద్య రంగంలో రోగులకు మంచి సేవ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ లు రామసహాయం రఘురాం రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ







## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని, ఎమ్మెల్యే. బిర్లను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ చిన్నం. బీరప్ప

**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ చిన్నం బీరప్ప, మాజీ ఎంపిటిసి మర్యాల వెంకటేశ్వర్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నీ మరియు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం అభివృద్ధికి సంబంధించిన పనుల కోసం మరియు ఉప్పలపాడు గ్రామం నుండి మోదుబావి గూడెం వరకు కొత్తగా బీటీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామానికి అనుసంధానంగా ఉన్న ఇతర కనెక్టివి రోడ్లోను మంజూరు చేయాలని కోరగా మంత్రి మరియు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం జరిగింది.



## మత్తులో వాహనం నడిపితే చర్యలు తప్పవు

### పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** అరైవ్ – అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా సూర్యాపేట పట్టణ పోలీసులు ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పట్టణ సిఐ వెంకటయ్య వాహనదారులను ఉద్దేశించి మాట్లాడారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని, నేరమని తెలిపారు. జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం మత్తు వల్ల ఎదుటివారి కూడా ప్రాణాపాయస్థితి ఏర్పడుతుందని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని పోలీసు సూచనలను పాటించాలని అన్నారు. ట్రాఫిక్ ఎసచవతీతీచ సాయిరాం మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో నిత్యం మద్యం మత్తు తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.




## తెలంగాణ రుచులకు రేవంత్ ఫిదా!



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** అచ్చమైన తెలంగాణ ఇంటి వంటల రుచులౌ ఆత్మీయ ఆతిథ్యరౌ సంప్రదాయ పరిమళరౌ ఇవన్నీ కలిసిన ప్రత్యేక విందు ఖమ్మంలో జరిగింది. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసంలో ఘనమైన తెలంగాణ వంటకాల విందు ఏర్పాటు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆహ్వానంతో ఏర్పాటు చేసిన ఈ విందులో స్వచ్ఛమైన తెలంగాణ రుచికి సీఎం రేవంత్ రెడ్డి ఫిదా అయ్యారు. "భోజనం అదిరిందౌ ఆతిథ్యం మెరిసింది" అన్నట్టుగా సాగిన ఈ విందులో తెలంగాణ నేటివిటీ ప్రతి వంటకంలో ఉట్టిపడింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, సహచర మంత్రులు, ఇతర ముఖ్యులు విందుకు హాజరయ్యారు. ఇది పక్కా తెలంగాణ ఇంటి వంట రుచి అని పేర్కొన్నారు. తెలంగాణ స్టైల్లో వండిన ఘాటైన నాటుకోడి పులుసౌనోరూరించే రొయ్యల ఇగురౌచేపల కూరౌ అదిరిపోయే మటన్ ఫ్రైౌప్రత్యేక రుచితో చేసిన మటన్ కీమా రుచి చూసిన సీఎం వాటిని ఇష్టంగా ఆరగించారు. దాదాపుగా 17 రకాల నోరూరించే వంటకాలతో సీఎంకు రాజభోజనం వడ్డించారు. ఈ విందులో మంత్రి సతీమణి పొంగులేటి మాధురి ప్రతి వంటకం సంప్రదాయ రుచులు తగ్గకుండా ఉండేలా స్వయంగా పర్యవేక్షించి తయారు చేయించారు. మాంసాహారంతో పాటు వేడివేడి జొన్న రొట్టెలు, రుచికరమైన వెజ్ పలావ్, క్యారెట్––కొబ్బరి ఇగురు, పచ్చిమిర్చి పచ్చడి వంటి శాఖాహార వంటకాలు కూడా సీఎంను విశేషంగా ఆకట్టుకున్నాయి. భోజనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి, హస్తకళా పెయింటింగ్ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దంపతులు, మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి బహూకరించారు.

# మతిమరుపు వచ్చేసిందా?

గదిలోకి ఎందుకు వచ్చానబ్బా?"బైక్ తాళం చెవి ఇక్కడే పెట్టానే, కనిపించటం లేదేం?"ఈ అబ్బాయి పేరేంటో, అడిగితే బాగుండదేమో!"ఇప్పటివరకూ నోట్లో నానుతూనే ఉందే, అదేంటో చప్పున గుర్తురాదేం?'ఇలాంటి అనుభవాలు తరచూ ఎదురయ్యేవే. ఉన్నట్టుండి మెదడు మొద్దుబారటం.. ఉన్నట్టుండి వస్తువులు, మనుషుల పేర్లు మరచిపోవటం మామూలే. వాక్యాలను పూర్తి చేయలేక, పదాలు తట్టక సతమతం కావటం.. దుకాణానికి వెళ్లి ఏం కొనాలో మరచిపోవటం చూస్తూనే ఉంటాం. దీనికి వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారిలోనూ కనిపిస్తూనే ఉంటుంది. దీంతో అప్పుడే మతిమరుపు వచ్చేసిందా? డిమెన్షియా, అల్జీమర్స్ దాడి చేస్తున్నాయా? అని కలవరపడుతుంటారు కూడా.

అప్పుడప్పుడూ మరచిపోవటానికి నిద్రలేమి, విశ్రాంతి కొరవడటం, మద్యం తాగటం వంటివి దారితీస్తుంటాయి. హఠాత్తుగా, ఏదైనా కడుపు నిండా తిన్న తర్వాత రక్తసరఫరా మెదడు నుంచి జీర్ణాశయానికి మళ్లటంతోనూ ఇలా జరగొచ్చు. కొన్ని మందులు.. ముఖ్యంగా అలర్జీ తగ్గించేవి, దగ్గు మందులు, కండరాలను వదులు చేసేవి, కొన్ని నొప్పి మాత్రల వంటివీ మరపు తెచ్చిపెట్టొచ్చు.


మరో ముఖ్యమైన కారణం హార్మోన్ల మార్పులు. శరీరంలోని దాదాపు అన్ని అవయవాలు.. ముఖ్యంగా మెదడు సమర్థంగా పనిచేయటానికి థైరాయిడ్ హార్మోన్లు కీలకం. వీటి లోపం మతిమరుపు తెచ్చిపెట్టొచ్చు. థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోతే బరువు పెరగటం, చర్మం పొడిబారటం, మలబద్ధకం, నిస్సత్తువ వంటి ఇతరత్రా లక్షణాలూ కనిపిస్తాయి.
మహిళల్లో గర్భం ధరించినప్పుడు, నెలసరి నిలిచినప్పుడు ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల మధ్య సమతుల్యత లోపిస్తుంది. ఇలాంటి సమయాల్లో కొద్ది నెలల పాటు మతిమరుపుతో ఇబ్బంది పడుతుంటారు. ఇది తాత్కాలికమే. కొద్దిరోజులకు అదే కుదురుకుంటుంది.
భయపడకుండా, బాధపడకుండా ఆయా ఘటనలు, సందర్భాలను నిశితంగా పరిశీలిస్తే తాత్కాలిక మతిమరుపు ఎందుకొచ్చిందనేది చాలామంది తమకు తామే గుర్తించగలరు. తలకు దెబ్బలు తగలటం, జబ్బులు రావటం, తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవటం వంటివి దీనికి దారితీస్తున్నట్టు తెలుస్తూనే ఉంటుంది. లక్షణాలు విడవకుండా వేధిస్తున్నా వెంటనే గాబరా పడాల్సిన పనిలేదు. మానసిక సమస్యేమో, అల్జీమర్స్, డిమెన్షియా వచ్చిందేమోనని చింతించటానికి బదులు ముందుగా కొన్ని పరీక్షలు చేయించుకోవటం మంచిది. రక్తంలో ఐరన్, థైరాయిడ్, బి విటమిన్లు.. ముఖ్యంగా బి12 పరీక్షలు చేయించుకోవాలి. లక్షణాలు తీవ్రమవుతున్నా లేదా రోజురోజుకీ ఎక్కువవుతున్నా మెదడు సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలు అవసరమవుతాయి.

## డిమెన్షియా హెచ్చరిస్తుంది

తీవ్ర మతిమరపును తెచ్చిపెట్టే డిమెన్షియా తీరే వేరు. ఇది కొన్ని హెచ్చరిక సంకేతాలు ఇస్తుంటుంది. సాధారణంగా ఇందులో మరపు తీవ్రంగా ఉంటుంది. ముఖ్యంగా తక్షణ విషయాలు, సంఘటనలు గుర్తుండవు. భవిష్యత్తు ప్రణాళికలు వేసుకోలేకపోవటం, అంచెలంచెలుగా ఆలోచించి తేలికగా పరిష్కరించగల సమస్యల విషయంలోనూ ఇబ్బంది పడటం కనిపిస్తుంటాయి. రోజూ చేసే, తెలిసిన పనులను చేయటానికీ కష్టపడుతుంటారు. తేదీలు, సమయం గుర్తించటంలోనూ తికమక పడుతుంటారు. కొందరు నలుగురితో కలవటానికీ వెనకాడటం చూస్తుంటాం. చిరాకు, కోపం, ఆందోళన, నిరాశ, దిగులు వంటివీ తలెత్తొచ్చు. ఇలాంటి లక్షణాలను చాలావరకూ కుటుంబ సభ్యులే పసిగడుతుంటారు. వీటిని గమనిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. మతిమరపు రావటానికి సరిదిద్దుకోదగిన కారణం ఉన్నట్టు తేలితే తగు చికిత్స తీసుకుంటే గణనీయమైన ఫలితం కనిపిస్తుంది. లక్షణాలు వెనక్కి మళ్లొచ్చు కూడా.


## మెదడు ఆరోగ్యంపై దృష్టి

- వయసు మీద పడుతున్నకొద్దీ కొంత మేధాశక్తి తగ్గటం, ఎంతోకొంత మతిమరపు సహజం. కాబట్టి మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.
- మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి జీవనశైలి జబ్బులను అదుపులో ఉంచుకోవాలి.
- రోజూ పండ్లు, కూరగాయలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తినాలి.
- విటమిన్ డి, క్యాల్షియం తగ్గితే భర్తీ చేసుకోవాలి.
- వయసు మీద పడుతున్నకొద్దీ బి విటమిన్లను సంగ్రహించుకునే శక్తి తగ్గుతుంది. మెట్‌ఫార్మిన్ వంటి మందులతోనూ ఇలా జరగొచ్చు. కాబట్టి బి విటమిన్లను తీసుకోవాలి.
- ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలూ మేలు చేస్తాయి.
- రోజుకు కనీసం 40 నిమిషాలు వ్యాయామం, శారీరక శ్రమ చేయాలి. దీంతో మెదడుకు తగినంత రక్తం సరఫరా అవుతుంది. కండరాల నుంచి మేలు చేసే రసాయనాలు విడుదలై, మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.
- నలుగురితో కలవటం, పుస్తకాలు చదవటం, పజిల్స్ పూరించటం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటం వంటి పనులతో మెదడును చురుకుగా ఉంచుకోవాలి.
- రోజుకు 7-8 గంటల సేపు నిద్రించాలి. దీంతో మెదడుకు తగినంత విశ్రాంతి లభించి, పునరుత్తేజితమవుతుంది.
- మానసిక ఒత్తిడి మేధాశక్తిని గణనీయంగా దెబ్బతీస్తుంది. కాబట్టి దీన్ని అదుపులో ఉంచుకోవాలి. మనం మార్చటానికి వీల్లేని పరిస్థితుల గురించి అదేపనిగా ఆలోచించటం, బాధపడటం మానెయ్యాలి. శ్వాస మీద ధ్యాస పెట్టి చేసే ధ్యానం, ప్రాణాయామం మనసు తేలిక పడటానికి తోడ్పడతాయి.



# నిద్రవేళలు మారుతున్నాయా?

తరచూ రాత్రి షిఫ్టుల్లో పనిచేస్తున్నారా? వేర్వేరు టైమ్ జోన్లకు మారుతున్నారా? కాస్త జాగ్రత్త. ఇలా మాటిమాటికీ నిద్రవేళలు మారిపోవటం ప్రమాదకరమని, దీంతో మహిళల్లో తీవ్ర రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరుగుతోందని అమెరికా అధ్యయనం చెబుతోంది. నిద్రవేళలు మారితే శరీరంలోని జీవగడియారం అస్తవ్యస్తమవుతుంది. ఇది రొమ్ముల్లోని క్షీరగ్రంథుల ఆకృతిని మారుస్తున్నట్టు, రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఇది రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తున్నట్టు కనుగొన్నారు. జీవగడియారం కేవలం నిద్ర వేళలను నియంత్రించటమే కాకుండా హార్మోన్ల విడుదలను సమన్వయం చేయటం, కణజాలాల మరమ్మతు, రోగనిరోధక వ్యవస్థ నిఘాలోనూ సాయం చేస్తుంది. అంటే జీవగడియారం అస్తవ్యస్తమైతే సహజ రక్షణ వ్యవస్థ గతి తప్పుతుందన్నమాట. దీంతో శరీరానికి హాని చేసేవాటిని గుర్తించే సామర్థ్యమూ తగ్గుతుంది. ఫలితంగా తీవ్ర రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరుగుతోందని పరిశోధకులు చెబుతున్నారు. నిద్రవేళలు మారటం వల్ల కణితులు త్వరగా వృద్ధి చెందటమే కాకుండా క్యాన్సర్ కణాలు మనుగడ సాగించటానికి, ఇతర భాగాలకు వ్యాపించటానికి అనువైన వాతావరణం ఏర్పడుతోందనీ వివరిస్తున్నారు.






# న్యూజిలాండ్‌దే సిరీస్

## మూడో వన్డేలో భారత్ ఓటమి

### మిచెల్, ఫిలిప్స్ సెంచరీలు

### విరాట్ శతకం వృథా

**ఇండోర్ :** ఇటీవల స్వదేశంలో ఓటములు చవిచూస్తున్న భారత జట్టుకు మరో చేదు అనుభవం. ఈసారి వన్డేల్లో దెబ్బతింది! న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమ్‌ఇండియా కోల్పోయింది. బంతి, బ్యాట్‌తో విఫలమైన శుభ్‌మన్ బృందం మూడో వన్డేలో 41 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆదివారం మొదట కివీస్ 8 వికెట్లకు 337 పరుగులు చేసింది. డరిల్ మిచెల్ (137 131 బంతుల్లో 15x4, 3x6) వరుసగా రెండో సెంచరీ చేయగా.. గ్లెన్ ఫిలిప్స్ (106 88 బంతుల్లో 9x4, 3x6) కూడా శతకం సాధించాడు. అర్ష్‌దీప్, హర్షిత్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో భారత్ 46 ఓవర్లలో 296 పరుగులకే ఆలౌటైంది. విరాట్ కోహ్లి (124 108 బంతుల్లో 10x4, 3x6) వీరోచిత సెంచరీ, నితీశ్‌కుమార్ రెడ్డి (53 57 బంతుల్లో 2x4, 2x6), హర్షిత్ (52 43 బంతుల్లో 4x4, 4x6) మెరుపులు భారత్‌ను గెలిపించలేకపోయాయి. జాక్ ఫౌక్స్ (3/77), క్లార్క్ (3/54), లెనాక్స్ (2/42) భారత్‌కు కళ్లెం వేశారు.



**కోహ్లి శతకబాదినా..:**

భారత్ ఇన్నింగ్స్ కూడా న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌నే తలపించింది. అయితే టీమ్‌ఇండియా ఫినిషింగ్ చేయలేకపోయింది. భారీ ఛేదనలో ఆరంభంలోనే భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. రోహిత్‌శర్మ (11) తొలి వికెట్ రూపంలో ఔటయ్యాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (23), శ్రేయస్ అయ్యర్(3)తో పాటు గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన రాహుల్ (1) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో భారత్ 71/4తో కష్టాల్లో చిక్కుకుంది. ఈ స్థితిలో నితీశ్‌కుమార్‌తో కలిసి కోహ్లి స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. నియంత్రణతో కూడిన షాట్లతో అతడు స్కోరు పెంచాడు. కుదురుకున్నాక తన షాట్లు ఆడిన విరాట్.. 51 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. నితీశ్‌కుమార్ నుంచి అతడికి చక్కటి సహకారం అందింది. మరోవైపు ఫౌక్స్ బౌలింగ్‌లో ఓ మెరుపు సిక్స్ బాదిన నితీశ్.. ఫిలిప్స్ వేసిన బంతినీ స్టాండ్స్‌లోకి కొట్టాడు. ఇదే క్రమంలో వన్డేల్లో తొలి అర్ధసెంచరీని నమోదు చేశాడు. సాధించాల్సిన రన్‌రేట్ మరీ ఎక్కువగా లేకపోవడం, కోహ్లి-నితీశ్ కుదురుకోవడంతో భారత్‌కు విజయావకాశాలు కనిపించాయి. కానీ నితీశ్‌ను ఔట్ చేసిన క్లార్క్..భారత్‌ను దెబ్బ కొట్టాడు. తర్వాత జడేజా (12) కూడా ఔటైపోవడంతో భారత్ 178/6తో ఇక కష్టమే అనిపించింది. ఈ స్థితిలో కోహ్లికి జత కలిసిన హర్షిత్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఎడాపెడా షాట్లు బాదిన అతడు సాధించాల్సిన రన్‌రేట్‌ను కరిగించాడు. మరోవైపు ఫౌక్స్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ బాదిన కోహ్లి.. అదే జోరుతో 91 బంతుల్లో సెంచరీ చేశాడు. జేమీసన్ వేసిన 43వ ఓవర్లో కోహ్లి-హర్షిత్ జంట 21 పరుగులు రాబట్టడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ తర్వాతి ఓవర్లోనే వరుస బంతుల్లో హర్షిత్ రాణా, సిరాజ్ ఔట్ కావడంతో భారత్ పనైపోయింది. ఆఖరిదాకా పోరాడిన విరాట్.. తొమ్మిదో వికెట్ రూపంలో వెనుదిరిగాడు.

**తడబడి నిలబడిన కివీస్:** అంతకుముందు న్యూజిలాండ్ ఇన్నింగ్స్ మొదలైన తీరుకి.. ముగిసిన విధానానికి పొంతనే లేదు. 5 పరుగులకే 2 వికెట్లు.. 58కే 3 వికెట్లు ఇలా సాగింది ఆ జట్టు ఆట. కానీ భారీ స్కోరుతో ఇన్నింగ్స్‌ను ముగించిందంటే కారణం డరిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్‌ల సూపర్ బ్యాటింగే. గత మ్యాచ్ ఫామ్‌ను కొనసాగిస్తూ మిచెల్ మరో సెంచరీ బాదేయగా.. ఫిలిప్స్ సైతం శతకాన్ని అందుకోవడంతో భారత్ ముంగిట భారీ లక్ష్యం నిలిచింది.




## రోహిత్‌శర్మకు ఏమైంది?

టీమ్‌ఇండియాలో రోహిత్‌శర్మకు హిట్‌మ్యాన్ అనే పేరు ఉంది. తను అనుకుంటే ఎలాంటి బంతినైనా బౌండరీకి తరలించేంత సత్తా ఉంది. అదంతా తన బలంతోపాటు టైమింగ్‌తో చేస్తూ వచ్చాడు. అందుకే బౌలర్ ఎంత మంచి బంతి వేసినా బౌండరీకి దారిచూపించాడు. కానీ న్యూజిలాండ్ సిరీస్‌లో ఒకే తప్పు మళ్లీ మళ్లీ మూడు సార్లు చేశాడు. దీంతో రోహిత్ 'పట్టు' ఎందుకు తప్పుతోంది అనే చర్చ మొదలైంది. న్యూజిలాండ్‌తో సిరీస్‌కి ముందు రోహిత్‌శర్మ మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచుల్లో వరుసగా 75, 14, 57 పరుగులు చేశాడు. అంతకుముందు ఆస్ట్రేలియాపై సెంచరీ (121), అర్ధ సెంచరీ (73) ఉన్నాయి. అందుకే కివీస్ సిరీస్‌లో హిట్‌మ్యాన్‌షో చూద్దామని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. కానీ సిరీస్ ముగిసే సమయానికి 'ఏమైంది రోహిత్‌కి.. ఎందుకిలా ఔటవుతున్నాడు?' అని ఆశ్చర్యపోయే పరిస్థితి నెలకొంది. కివీస్ సిరీస్‌లో రోహిత్ స్కోర్లు చూస్తే మూడు మ్యాచుల్లో వరుసగా 26, 24, 11. ఈ మ్యాచుల్లో రోహిత్ షాట్ సెలక్షన్ బాగానే ఉన్నా.. బ్యాటు పట్టు తప్పుతోంది. మూడు మ్యాచుల్లో బంతి వేసే బౌలర్లు, పట్టే ఫీల్డర్ మారొచ్చు కానీ, ఒకేలా ఔటయ్యాడు. ప్రతిసారి షాట్ కొట్టేటప్పుడు చేతిలో బ్యాటు తిరిగిపోయింది. దాంతో పట్టు తప్పి.. టైమింగ్ కుదరక క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. దీంతో జట్టులో స్థానంపై మరోసారి చెణుకులు మొదలయ్యాయి. అయితే, ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్ని అర్థం చేసుకొని తనను తాను మర్చుకోవడంలో హిట్‌మ్యాన్ ఎప్పుడూ ముందుంటాడు. తన 'పట్టు'ను తిరిగి సాధించి తనేంటో నిరూపిస్తాడు. కాకపోతే వన్డేల్లో రోహిత్‌ని తిరిగి చూడాలంటే మరో ఆరు నెలలకుపైనే ఆగాలి. జులై 14 నుంచి ఇంగ్లాండ్ సిరీస్ మొదలవుతుంది. అప్పుడు టీమ్‌లోకి తీసుకుంటే తిరిగి ఇండియన్ జెర్సీ వేసుకుంటాడు.



## విజయ్ హజారే విజేత విదర్భ

బెంగళూరు: విదర్భ అదరగొట్టింది. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీని తొలిసారి కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో విదర్భ 38 పరుగుల తేడాతో సౌరాష్ట్రపై గెలిచింది. మొదట విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 317 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అథర్వ తైదె (128 118 బంతుల్లో 15ఐ4, 3ఐ6) అద్భుత శతకం సాధించాడు. అతడికి తోడు యశ్ రాఠోడ్ (54), అమన్ మోఖడే (33) రాణించారు. అథర్వ, రాఠోడ్ ద్వయం రెండో వికెట్‌కు 133 పరుగులు జోడించింది. అంకుర్ పన్వర్ నాలుగు వికెట్లతో మెరిశాడు. చిరాగ్ జాని, చేతన్ సకారియా చెరో రెండు వికెట్లు తీశారు. భారీ లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర.. 48.5 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌటైంది. టోర్నీలో ఆ జట్టు తరఫున అత్యధిక పరుగులు చేసిన హార్విక్ దేశాయ్, సెమీఫైనల్ హీరో విశ్వరాజ్ జడేజా విఫలమవడం ఆ జట్టును దెబ్బ తీసింది. ప్రేరక్ మన్కడ్(88), చిరాగ్ (64) పోరాటం సరిపోలేదు. యశ్ ఠాకూర్ నాలుగు, నచికేత్ భూటె మూడు వికెట్లు పడగొట్టారు.





# ఐదు నిమిషాల యాడ్ కోసం రూ.5 కోట్లు

స్టార్ హీరోయిన్, లేడీ సూపర్ స్టార్ నయనతార గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'గజిని' మూవీతో ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిన్నది ఆ తర్వాత 'లక్ష్మీ' మూవీతో భారీ హిట్ అందుకుంది. ఇక అప్పటినుంచి ఇప్పటివరకు స్టార్ హీరోయి-ఎన్ రేంజ్‌లో ఎదుగుతుంది. ఇక రీసెంట్‌గా అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగా స్టార్ చిరంజీవి హీరోగా నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీతో మన ముందుకు వచ్చి మంచి విజయం సాధించింది. మరోపక్క రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక మూవీలో గంగ పాత్రలో అలరించనుంది. అలాగే 'అమ్మోరు తల్లి-2' సినిమాలో కూడా యాక్ట్ చేస్తుంది. అలా సినిమాలతో పాటు ఫ్యామిలీ లైఫ్‌ను కూడా లీడ్ చేస్తుంది. ఈ క్రమంలో ఈ చిన్నదానికి సంబంధించిన ఓ న్యూస్ నెట్టింట వైరల్‌గా మారింది. వైరల్ అవుతున్న న్యూస్ ప్రకారం ఈ చిన్నది టాటా స్కై యాడ్‌లో 5నిమిషాలు నటించడానికి రూ.5 కోట్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం ఐదు నిమిషాలకు అంత మనీ తీసుకుంటుందంటే ఈ అమ్మడు రేంజ్ ఏంటో ఇక్కడే తెలిసిపోతుంది. ప్రస్తుతం ఇందుకు సంబందించిన న్యూస్ నెట్టింట వైరల్‌గా మారింది.



## చీరలో బాపు బొమ్మలా

# సంయుక్త మీనన్

తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన యంగ్ బ్యూటీ సంయుక్త మీనన్ గురించి మనందరికీ సుపరిచితమే. ఫస్ట్ సినిమాతోనే మంచి ఫేమ్ తెచ్చుకున్న ఈ చిన్నది తర్వాత వరుస ఆఫర్లు అందుకుంటూ మంచి క్రేజ్ సంపాదించింది. ఇక రీసెంట్‌గా బాలకృష్ణ సరసన 'అఖండ-2' మూవీలో యాక్ట్ చేసిన ఈ చిన్నది తాజాగా యంగ్ హీరో శర్వానంద్(హ్రుష్ముతీఝుఋఝుఅఽ)తో 'నారి నారి నడుమ మురారి' మూవీతో మన ముందుకు వచ్చింది. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయన ఈ చిత్రం మంచి విజయం సాధించింది. మరోపక్క సోషల్ మీడియాలో కూడా బాగా యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా సంయుక్త తన సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో స్లీవ్ లెస్ బ్లౌజ్ ఆరెంజ్ కలర్ శారీలో చాలా ట్రెడిషనల్‌గా రెడీ అయింది. మల్లెపూలు, బుట్టాలు, గాజులు, బొట్టు పెట్టుకొని బాపు బొమ్మలా కనిపించింది. ఇక చేతిలో కలువ పూలు పట్టుకున్న ఫొటోలు కూడా షేర్ చేసింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు కత్తిలా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం ఈ చిన్నదాని పోస్ట్ పై మీరు ఓ లుక్ వేసేయండి.



# ధనుష్‌తో పెళ్లి.. స్పందించిన మృణాల్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, క్రేజీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ డేటింగ్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ రూమర్లు కాస్తా ముదిరి, ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే రోజే వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారంటూ ప్రచారం కూడా జరిగింది. అంతేకాదు, పార్టీల్లో వీరిద్దరూ క్లోజ్‌గా కనిపించిన ఫొటోలు నెట్టింట వైరల్ కావడంతో, ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లైంది. ఎక్కడ చూసినా ధనుష్-మృణాల్ పెళ్లి గురించే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో, తాజాగా మృణాల్ ఓ పోస్ట్ ద్వారా ఈ రూమర్లపై స్పందించినట్లుగా నెటిజన్లు భావిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె షేర్ చేసిన ఓ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఆ వీడియోలో మృణాల్ పడవపై నిలబడి, సముద్రపు గాలి, బంగారు సూర్యకిరణాల మధ్య ఎంతో ప్రశాంతంగా కనిపించింది. జుట్టు విరబోసుకుని, విశాలమైన చిరునవ్వుతో, పూర్తిగా రిలాక్స్‌డ్ మూడ్‌లో ఉన్న ఆమె లుక్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఈ వీడియోకు ఆమె "స్థిరంగా, ప్రకాశవంతంగా, అచంచలంగా" అనే క్యాప్షన్ జత చేసింది. దీంతో ఈ క్యాప్షన్‌నే ధనుష్‌తో పెళ్లి రూమర్లపై మృణాల్ ఇచ్చిన పరోక్ష సమాధానంగా నెటిజన్లు భావిస్తున్నారు. తన జీవితంపై వస్తున్న పుకార్లు తనను ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని, ప్రస్తుతం ప్రశాంతంగా తన జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నానన్న సందేశాన్ని ఈ వీడియో ద్వారా మృణాల్ ఇచ్చిందనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com